క్లుప్తంగా

6 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు సిబ్బందితో రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కేరళ రాష్ట్రం, కోజికోడ్ జిల్లాకు చెందిన ఫవాస్ టీవీ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని జీఆర్పీ సిబ్బందికి అప్పగించగా 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

అనుమతులు లేకుండా ఔషధాలు విక్రయించిన వ్యక్తికి జైలు

విశాఖ లీగల్: అనుమతి లేకుండా మందుల దుకాణం నిర్వహించిన వ్యక్తికి ఆరు నెలలు జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ నగరంలోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె.గాయత్రి దేవి శుక్రవారం తీర్పునిచ్చారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు తెలిపిన వివరాలివి.. నగరంలోని నందగిరినగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్దాల సత్యనారాయణ ఔషధాలు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు 2013 జూన్ 14న ఔషధ తనిఖీ అధికారులు ఆర్.లలిత, కె.రజిత, ఎ.టి.వి.రమాదేవి ఈ దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి లైసెన్స్‌లు లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతనిపై ఔషధ విక్రయ నిషేధ చట్టం సెక్షన్ 23(5)(బి) కింద కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి ఐదు రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

గుణుపూర్ పాసింజర్‌కు మరో స్లీపర్ కోచ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం పాసింజర్(58506/58505)కు ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మరో స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

కేకే రాజుని కలిసిన నాయకులు



కేకే రాజుతో వైఎస్సార్ సీపీ నాయకులు

సీతమ్మధార : వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజక వర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కేకే రాజుని సీతమ్మధారలోని ఆయన కార్యాలయంలో పార్టీ 42వ వార్డు నాయకులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. సీనియర్ నాయకులు కంచు రమణమూర్తి, గాలి ప్రసాద్, లోకేష్, మైనారిటీ విభాగం నాయకులు రియాజ్, రిజ్వాన్ ఖాన్, సాయి జగదీష్, మహిళలు స్వర్ణ, కనకమహాలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: కడియం–ద్వారపూడి–అనపర్తి సెక్షన్ మధ్య ఆధునికీకరణ పనులు జరుగుతున్న కారణంగా ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేశారు. ఈ నెల 1, 2వ తేదీల్లో గుంటూరు–విశాఖపట్నం(12739) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2,3వ తేదీల్లో విశాఖపట్నం–గుంటూరు(12740)సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2న ఇరువైపులా విశాఖపట్నం–గుంటూరు–విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, 3న లింగంపల్లి–విశాఖపట్నం(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అలరించిన గాత్ర కచేరీ



కీర్తనలు అలపిస్తున్న గాయని దేవి సుజాత

సీతంపేట : స్థానిక శ్రీలలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. గాయని తిరువీధుల దేవి సుజాత ఎంతో మాధుర్యంగా త్యాగరాజ కీర్తనలు ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఆమెకు హెచ్.రామచరణ్ వయోలిన్‌పై, ఎం.కామేష్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కళాకారులను సత్కరించారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా సంధ్యాదేవి



దాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యాదేవిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ ఓబీజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ గరుడ బుచ్చిరాజు ఉద్యోగ విరమణ చేయడంతో.. ఆయన స్థానంలో సంధ్యాదేవిని నియమించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జిల్లా సమన్వయకర్త రాజారావు



ఆర్పీ పేట స్కూల్‌లో సైన్స్ ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి విశాఖపట్నం జిల్లా సమన్వయకర్త పి.రాజారావు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రాంప్రసాద్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 50 సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ప్రతి విభాగంలో విజేతలకు బహుమతులు అందజేశారు.

సైన్స్ ప్రయోగాల వైపు.. విద్యార్థుల చూపు

కంచరపాలెం: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు తమలో దాగిన సృజనను వెలికితీసేలా ఎన్నో ప్రయోగాలు చేపడుతున్నారని ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వక్తృత్వ, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలల్లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించే సంప్రదాయం క్రమంగా పెరిగితే విద్యార్థి లోకం ప్రయోగాలపై ఆసక్తి చూపుతుందన్నారు. ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, సిహెచ్.చంద్రశేఖర్, పెద్దాడ వెంకటేశ్వరరావు, బి.పరమేశ్వరరావు, అల్లం వెంకటరమణ, ఆదిశేషగిరి, శిరీష, ఉమాసత్యవేణి, సునీత, కనకరత్నం పాల్గొన్నారు.

దేశాన్ని నాశనం చేస్తున్న ప్రధాని మోదీ

- దక్షిణాది భాషలు లేకుండా కుట్ర
- సెక్యులర్ పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న పవన్
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

సీతమ్మధార : భారత దేశాన్ని ప్రధాని మోదీ సర్వ నాశనం చేశారని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆశీల్ మెట్ట వద్దనున్న కేఏ పాల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ డీ లిమిటేషన్ పై రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఉత్తర భారతదేశంలో ఎంపీలను పెంచి, దక్షిణ భారత దేశంలో ఎంపీ స్థానాలు తగ్గిస్తున్నారని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళం, తెలుగు, కన్నడ భాషలు లేకుండా చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. గురువారం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇదే ఆరోపించారని, హిందీ భాషను రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం 30 భాషలు లేకుండా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం నగదు బదిలీ అనేది ఒక నాటకం అని, తల్లికి వందనం లేకుండా చేశారని ఆరోపించారు. నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో మహిళలకు, నిరుద్యోగులకు మొండి చేయి చూపారని తెలిపారు. రూ.పది లక్షల కోట్లు అప్పు ఉందని చంద్రబాబుకు ముందు తెలియదా అని ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 30 వేల మహిళలు తప్పి పోయారని గత ప్రభుత్వం హయాంలో ఆరోపించారని, అధికారంలోకి రాగానే వారిని వెనక్కి రప్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ ఎంతవరకు నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ సనాతన ధర్మం అంటూ తిరుగుతున్నాడని, ఎన్నికల ముందు సనాతన ధర్మమే నాకు ముఖ్యమని పవన్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. పవన్ పేరుకే సెక్యులర్ అంటారని, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నాడని ఆరోపించారు. గత ప్రభుత్వం కన్నా నేడు కల్తీ మద్యం ఏరులై పారుతోందన్నారు. జగన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అసెంబ్లీకి వెళ్లాలని, ముఖ్యంగా జగన్ అసెంబ్లీ వెళితేనే ప్రతి పక్షం అనేది ఉంటుందన్నారు.

త్వరలో పోలీసులకు సీటీ కరోనరీ యాంజియోగ్రామ్



పోలీస్ వందనం స్వీకరిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం వార్షిక డీ–మోబిలైజేషన్ సెర్మోనియల్ పరేడ్ ఘనంగా జరిగింది. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా పాల్గొని పరేడ్‌ను పరిశీలించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందికి వార్షిక డీ–ఆర్మ్‌డ్ రిజర్వ్ శుభాకాంక్షలు తెలిపారు. 2019 తర్వాత ఈ ఏడాది మళ్లీ మోబిలైజేషన్ నిర్వహించినట్లు చెప్పారు. పోలీస్ నిబంధనల ప్రకారం ప్రతి జిల్లాలోనూ ఆర్మ్‌డ్ రిజర్వ్ జనవరి, ఫిబ్రవరిలో 12 నుంచి 13 రోజులు చేయాలన్నారు. ఈ నెల 14 నుంచి నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసిందన్నారు. ఫైరింగ్, ఫిజికల్, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. ఆయుధాలతో విధులు నిర్వహిస్తున్నప్పుడు సిబ్బంది చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తనకు ఫోన్ చేయాలని, తప్పకుండా సాయం చేస్తానని చెప్పారు. సెలవులు ఇవ్వకపోతే తనకు తెలియజేయాలని కోరారు. చెడు అలవాట్లకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. త్వరలోనే సిబ్బందికి సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ చేస్తామన్నారు.

ఎట్టకేలకు పూర్వ డీఆర్ఎంకు బెయిల్

సాక్షి, విశాఖపట్నం: టెండర్లకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన వాల్తేరు రైల్వే పూర్వ డీఆర్ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గతేడాది నవంబర్‌లో ముంబయిలో ఓ కాంట్రాక్ట్ సంస్థకు చెందిన వ్యాపారుల నుంచి లంచం తీసుకుంటూ సౌరభ్‌కుమార్ దొరికిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీబీఐ జైలులోనే సౌరభ్ కుమార్ ఉన్నారు. హిందూస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి రూ.3.17 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే పనులు ఆలస్యంగా చేయడంతో రైల్వే బోర్డు భారీ జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో బిల్లులు క్లియరెన్స్‌తో పాటు జరిమానా తగ్గించేందుకు సౌరభ్‌కుమార్ రూ.30 లక్షల లంచం అడిగినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. చివరికి రూ.25 లక్షలు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడంతో పుణెలో లంచం తీసుకుంటూ కేంద్ర దర్యాప్తు సంస్థకు రెడ్ హ్యాండెడ్‌గా సౌరభ్‌కుమార్ దొరికిపోయారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా సీబీఐ ప్రత్యేక కోర్టు(ముంబయి) తిరస్కరించింది. చివరికి సొంత పూచీకత్తుతో శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. సౌరభ్‌కుమార్ నేరాలకు సంబంధించిన పూర్తి ఆధారాలను సీబీఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. నిందితుడు సస్పెండ్ అయ్యారని తెలిపారు. సాక్షుల వాంగ్మూలాలు తీసుకున్నందున సాక్ష్యాలు, రికార్డులు తారుమారు చేసే అవకాశం లేదని సీబీఐ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి అమిత్‌ఖర్కర్ అన్నారు. నేరారోపణ నిరూపితమైతే సౌరభ్‌కుమార్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నందున.. శిక్ష తీవ్రతను పరిగణలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.

టైలర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి



టైలరింగ్ గురువును సత్కరిస్తున్న నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, తదితరులు

సీతంపేట : టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కోరారు. గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శంకరమఠం ఎదురుగా పద్మశాలి భవనంలో శుక్రవారం నిర్వహించిన టైలర్స్ దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రెడీమేడ్ వస్త్రాల రాకతో దర్జీల బతుకులు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురికి టైలరింగ్ నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నార్త్ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, టైలర్స్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్.యాదగిరి, ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్.వేణు, సంయుక్త కార్యదర్శి ఎస్.కె.ఇషాక్, కోశాధికారి సీహెచ్.తిరుమలరావు, సంయుక్త కోశాధికారి ఆర్.కె.రాజు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మానగర్‌లో భార్య, పిల్లలతో శ్రీను నివసిస్తున్నారు. అతను బండి మీద సోడాలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో అతని ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగి ఇంట్లో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే నీళ్లు చల్లి మంటలార్పడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటి వరండా పక్కన విద్యుత్ స్తంభం షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ఇంట్లోని ఫ్రిడ్జ్, వాషింగ్‌మెషీన్, ఇతర వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.35 వేలు ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

‘పది’ పరీక్షల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ

అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జ్ఞానాపురంలో సిల్వర్ జూబ్లీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షల విధులు కేటాయించిన అధికారులతో శుక్రవారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను తీసుకుని వెళ్లకూడదన్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటిస్తూ ఎక్కడికక్కడ నోటీసులు అతికించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, దగ్గరలోని జిరాక్స్ షాపులను మూసి వేయించాలన్నారు. పరీక్ష ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరచడం, అక్కడ నుంచి కేంద్రాలకు తీసుకువస్తున్నప్పుడు, తిరిగి పోస్టాఫీసుకు పంపించేటప్పుడు ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ప్రతిక్షణం అప్రమత్తతతో ఉంటూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్యాసంచాలకుడు బి.విజయభాస్కర్, డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి



పోర్టు హాస్పిటల్ వద్ద దీక్ష శిబిరంలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్‌ను సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుకు ఇవ్వరాదని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 151వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, పోర్టు వద్ద ఉన్న రిజర్వు నిధులతో అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రైవేటీకరించాలనే బీజేపీ విధానం చాలా దుర్మార్గమైనదని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయంపై గత నాలుగేళ్లుగా పోరాడుతూ కాపాడుకున్నామన్నారు. డీసీఐని కూడా పోరాటాలతోనే కాపాడుకున్నామని... అదే స్ఫూర్తితో పోర్టు హాస్పిటల్‌ను కూడా కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ త్రినాథరావు, ఆనందరావు, అప్పారావు, రామలింగేశ్వర్రావు, రాఘవులు పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తికి రెండేళ్ల జైలు

విశాఖ లీగల్: స్వల్ప వివాదంలో ఒక వ్యక్తిని తీవ్రంగా కత్తితో గాయపరిచిన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష శిక్ష విధిస్తూ నగరంలోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె.గాయత్రి దేవి తీర్పునిచ్చారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలివి.. ఫిర్యాది నగరంలోని కై లాసపురం శాంతినగర్ ప్రాంతానికి చెందిన పూడి సత్యనారాయణ. ఆయన విశాఖ పోర్టు ట్రస్ట్‌లో పనిచేసే వాడు. నిందితుడు రౌతు సతీష్ కూడా అదే ప్రాంతంలో ఉంటున్నాడు. 2017 ఏప్రిల్ 25న సాయంత్రం నిందితుడు మద్యం సేవించి పూడి సత్యనారాయణ ఇంటికి వచ్చి గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. తదనంతరం రౌతు సతీష్ కత్తితో సత్యనారాయణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. ఫిర్యాది వెంటనే తన కుటుంబ సభ్యుల సహాయంతో సమీపంలోని పోర్టు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

సీతంపేట: ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యవర్గ సమావేశం, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీల నియామకం శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ నేషనల్ సెక్రటరీ అందే శ్యామ్ మాట్లాడుతూ సంస్థ అజెండా, కమిటీలు ఎలా పని చేయాలో వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎం.వరప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనే తేడా లేకుండా కమిటీ సభ్యులు అంబేడ్కర్ ఆలోచన, ఆశయాలతో, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. అనంతరం సొసైటీ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాల్మన్ జార్జ్, మహిళా అధ్యక్షురాలు కె.లక్ష్మి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణోత్సవాలు ప్రారంభం



అన్నమాచార్య సంకీర్తన ఆలపిస్తున్న గాయకులు

సీతమ్మధార : సీతమ్మధార గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరం వద్ద గల ఫంక్షన్ హాల్‌లో శ్రుతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ సారథ్యంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు మంగళ ధ్వని, వేద మంత్రాలతో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక యోగా గురువు కేఏ రాజు, గౌరవ ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, వంకాయల సన్యాసిరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య జీఎస్ఎన్ రాజు ప్రసంగిస్తూ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో లోకమంతా సుభిక్షంగా ఉండాలని కోరారు. ఆధ్యాత్మికంగా లోకకల్యాణం కోసం ఉత్సవం నిర్వహిస్తున్న వారిని అభినందించారు. శ్రీమాన్ పాణంగిపల్లి రంగనాథ ఆచార్యుల బృందం అమ్మవార్లకు కుంకుమార్చన, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. శృతిలయ భక్తి సంగీత సంస్థ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు, ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి, ఎ.వెంకటరావు బృందం భక్తి గీతాలాపన, నగరానికి చెందిన పలు సాంస్కృతిక సంస్థలు నిర్వహించిన భక్తి సంగీత కచేరీలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, వేణుగానం వీనుల విందుగా సాగాయి. శ్రీనివాస కల్యాణోత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డ్రై డే పాటించాలి



మధురానగర్‌లో నీటిలో పెరుగుతున్న దోమ లార్వాను పరిశీలిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ రత్నం

సీతంపేట : వారం రోజుల పైబడి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ పి.వై.ఎస్.రత్నం అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లో ఫ్రై డే డ్రై డే అమలు తీరును శుక్రవారం పరిశీలించారు. సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి దోమ లార్వాలు పెరుగుతున్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని, వారానికి ఒక రోజు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డి, ఆశా కార్యకర్తలు స్రవంతి, గౌతమి, జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది శివ, స్వామి పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు అవసరం

తాటిచెట్లపాలెం : యువత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గ్లోబల్ లీడర్స్‌గా ఎదిగేందుకు అవసరమైన విజ్ఞానపరమైన నైపుణ్యాలు, పరిశోధనల ప్రాధాన్యత, నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరమని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్, విశాఖపట్నం, అడ్వాన్స్‌డ్ లైట్ వాటర్ రియాక్టర్ డివిజన్ ప్రాజెక్ట్ మేనేజర్ పీకే మిశ్రా అన్నారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్, విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం దొండపర్తిలో గల కార్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వికసిత్ భారత్ కోసం గ్లోబల్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్‌లో భారత యువత సాధికారత అనే నినాదంతో ఈ సంవత్సరం సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. వికసిత్ భారత్ సాధనలో శాస్త్ర, సాంకేతిక రంగాల ప్రాముఖ్యతను గుర్తించాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్ డాక్టర్ కేవీ రామమోహనరావు తెలిపారు. సంస్థ గౌరవ కార్యదర్శి చల్లా సురేష్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.